క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన



కడియంలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి

కడియం: మండల పరిధిలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. కడియం ఆర్బీకేల పరిధిలో జరుగుతున్న కొనుగోళ్ల తీరును పరిశీలించి, స్థానిక రైతులతో మాట్లాడారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే రెండు రైసుమిల్లులను తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరగాలన్నది ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ మేరకు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి రైతులకు ఎదురయ్యే సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు.

ఘనంగా గోవింద వార్షిక పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న పండితులు

సీటీఆర్ఐ: గోవింద వార్షిక పవిత్రోత్సవాలు మంగళవారం రాత్రి విష్వక్సేన ఆరాధనతో మొదలయ్యాయని ఆలయ అర్చకుడు టి.శ్రీమన్నారాయణ ఆచార్యులు తెలిపారు. స్థానిక లాలాచెరువు సమీపంలోని గోవింద క్షేత్రంలో ఈనెల 17 వరకూ గోవింద వార్షిక పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. బుధవారం ఉదయం 8 గంటలకు యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, పూర్ణాహుతి, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ, 16వ తేదీన మంగళశాసనం తీర్థగోష్ఠి, 17 ఉదయం నిత్య హోమాలు, విశేష అలంకారం, పండిత సమ్మానం, స్వస్తి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

కార్తిక నిత్యాన్నదానం ప్రారంభం



జక్కంపూడి విజయలక్ష్మికి స్వాగతం పలుకుతున్న సాధనాల చంద్రశేఖర్

ధవళేశ్వరం: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తిక మాస నిత్యాన్న దాన కార్యక్రమం ప్రారంభించారు. దేవస్థానం మాజీ చైర్మన్ సాధనాల చంద్రశేఖర్ (శివ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, ముత్యాల పోసికుమార్, ముద్దాల అను, పట్టపగలు వెంకటలక్ష్మి, పెన్నాడ లక్ష్మి, నారపురెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ తీరు హాస్యాస్పదం

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని నరేంద్ర మోదీ ఒక వర్గం ఓటర్లను ఆకట్టుకునేందుకు తెలంగాణలో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభలో పాల్గొనడం హాస్యాస్పదంగా ఉందని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధానికి దళితులు, పేదలపై ఏమాత్రం కనికరం ఉన్నా, ఆర్థిక పరిస్థితులను గుర్తించి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉన్నప్పటికీ మాదిగల పోరాటంలో నేనూ పాల్గొంటానని ప్రకటించి సమస్య పరిష్కారానికి కమిటీ వేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. త్వరలో దళితుల్లో అన్ని వర్గాలను కలుపుకొని దళితుల సింహగర్జన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాడులలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఆరే భీమరాజును అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: లారీ ఢీకొన్న సంఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. దివాన్ చెరువు కంకరగుట్టలు ప్రాంతానికి చెందిన సరిమ సూర్యనారాయణ (80) సోమవారం రాత్రి 07.15 గంటల సమయంలో హైవే వద్ద టీ తాగాడు. అనంతరం ఇంటికి వచ్చేందుకు జాతీయ రహదారిని దాటుతుండగా లారీ ఢీకొంది. తీవ్రగాయాలైన అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అర్ధరాత్రి 12.50 గంటల సమయంలో మృతి చెందాడు. అతడి కుమార్తె సరిమ గంగ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్.వి జయకుమార్ బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు

- కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్‌రామ్
- ఘనంగా బాలల దినోత్సవం

కంబాలచెరువు: దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్ణయించబడుతుందని కలెక్టర్ కె.మాధవీలత, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో మంగళవారం జిల్లా స్థాయి బాలల దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ విద్య అనేది పిల్లలకి మనం ఇచ్చే ఆస్తి అని ముఖ్యమంత్రి జగన్ నిత్యం అధికారులతో అంటుంటారన్నారు. భావితరాలకు బాలలే వారసులన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేయడం, ఆధునిక బోధనా పద్ధతులను అందిస్తోందన్నారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకొని ఉన్నత స్థితికి రావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో నంబర్‌వన్ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, జువెనైల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ తబిత, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం, జిల్లా మహిళా,శిశు అభివృద్ధి, సాధికారత అధికారి కె.విజయ కుమారి, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్.నారాయణ, అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

- మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని ఆశ్రమంలో మంగళవారం బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ రామ్‌కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రియదర్శిని ఆశ్రమంలోని ఇంత మంది బధిర విద్యార్థుల మధ్య బాలల దినోత్సవంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యలో రాణించి ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఆశ్రమంలోని 120 మంది బధిర విద్యార్థులకు స్వయంగా అల్పాహారం అందించారు. వారితో ప్రత్యేక భాషలో మాట్లాడి వారి అవసరాలు తెలుసుకున్నారు. 20 ఏళ్లుగా ఆశ్రమం నిర్వహిస్తూ బధిర విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న నిర్వాహకురాలు కె.స్వప్నవర్ణ అభినందించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రిన్సిపాల్ కె.ఆశాలత, నిర్మల, రమాశాంతి, ఎలిషా రాజ్‌కుమార్, ప్రియాంక పాల్గొన్నారు.



బాలల దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్‌రామ్

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రకాష్ నగర్ రౌండ్ పార్క్ సమీపంలోని గాంధీనగర్ 2 మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లల హక్కులను తెలియజేశారు. వ్యాసరచన, కథల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.
- కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో న్యాయమూర్తి ప్రత్యూష కుమారి పాల్గొన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలలతో భిక్షాటన చేయించడం మొదలగు దురాచారాలను పూర్తిగా అంతమొందించేందుకు అందరి తోడ్పాటు అవసరమన్నారు. ఎలాంటి న్యాయ సమస్యలున్నా న్యాయ సేవల ఉచిత హెల్ప్ లైన్ నెంబరు 15100ను సంప్రదించాలన్నారు.
- స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలలో నెహ్రూ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ శ్రీమతి తేతలి సత్య సౌందర్య పూలమాల వేసి అంజలి ఘటించారు.

కడియం మండలంలో..

కడియం: బాలల దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. దుళ్ల ప్రాథమిక పాఠశాలలో బదిలీపై ఇక్కడి నుంచి వెళ్లిన ఉపాధ్యాయుడు గంపల పాపారావును సత్కరించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈవో వి.లజపతిరాయ్, హెచ్‌ఎం ఆనంద్, గ్రామస్తులు పాల్గొన్నారు. వేమగిరి కొండపైగల బుద్ధవిహారాలో నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వేమగిరి తోట రామాలయం వీధి ప్రాథమిక పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవానికి హెచ్‌ఎం జయరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో లజపతిరాయ్ పాల్గొన్నారు. వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.



ప్రియదర్శిని ఆశ్రయంలో బాలల దినోత్సవం



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ది ఫ్యూచర్ కిడ్స్ చైర్ పర్సన్ విజయ యేలేటి

ఫ్యూచర్ కిడ్స్‌లో..

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక కవలగొయ్యి రోడ్డులోని ది ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. చైర్‌పర్సన్ విజయ రవిబాబు యేలేటి బాలల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించి వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, డీన్ హర్షిణి, వైస్ ప్రిన్సిపాళ్లు సైదాభాను, శ్రీవల్లి పాల్గొన్నారు.

మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. హెచ్‌ఎం బి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా పిల్లలకు చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, మ్యాజిక్ బస్ యూత్ మెంటర్ టి.మరియ పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల ప్రదర్శనలు



మహనీయుల వేషధారణలో ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు

ధవళేశ్వరం: బాలల దినోత్సవం సందర్భంగా ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్లో జోష్ వేడుకలు ఘనంగా జరిగాయి. 'జోష్' పేరిట జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం మహనీయుల వేషధారణ పోటీలు నిర్వహించారు.

జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి, రుద్రమదేవి, మదర్ థెరిస్సా, భరతమాత తదితర వేషధారణలో విద్యార్థులు అలరించారు. విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఎ.రమేష్, ప్రిన్సిపాళ్లు వి.సంధ్యాకుమారి, జి.విమలారోజి, ఎన్.దీపిక, కె.లలితాదేవి పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు

- ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్
- ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ మేలు చేకూరాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి రావాలని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. నగరపాలకసంస్థ పరిధిలోని 26వ డివిజన్ ఇన్నీసుపేట 2 పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించి, అనంతరం పార్టీ పతకాన్ని ఎగురవేశారు. పార్టీ శ్రేణులతో కలిసి మానమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు.

రూ.20.15 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ఇన్నీసుపేట 2 సచివాలయం పరిధిలో రూ.20.15 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. గతంలో చంద్రబాబు 600 వరకూ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను ముఖ్యంగా రైతులు, డ్వాక్రా మహిళలను ఏ విధంగా బురిడీ కొట్టించారో మననం చేసుకోవాలని గుర్తుచేశారు. నాలుగున్నరేళ్లలో జగన్ సర్కార్ అందించిన సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని, జరిగిన మేలును దృష్టిలో పెట్టుకుని రాబోయే ఎన్నికలలో మరోసారి జగన్‌ను అధికారంలోకి తీసుకువచ్చేలా తీర్పునివ్వాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, డివిజన్‌ల జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పినీడి ప్రసాద్ బాబు (రాజమౌళి) మాట్లాడారు. కార్యక్రమంలో విశ్వేశ్వరాలయం డైరెక్టర్ కాపు భాను, డివిజన్ నేతలు అన్నందేవుల కృష్ణ, సిరికి శ్రీను, రంధి భాస్కర్, రామకృష్ణ, కొయ్యన రామచంద్రరావు, జగన్నాథం, వైఎస్సార్ సీపీ నేతలు బిల్డర్ చిన్న, కల్లి అప్పలరెడ్డి, రొంపిచర్ల రమేష్, అంగాడి సత్యప్రియ, షేక్ ఇమామ్, సబ్బెళ్ల విజయ దుర్గారెడ్డి, రొక్కం వంశీ, పడమట కామరాజు పాల్గొన్నారు.



ఇన్నీసుపేట 2 సచివాలయంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న చందన నాగేశ్వర్



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్



జేగురుపాడులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ సతీష్‌చంద్ర స్టాలిన్

సంక్షేమ ప్రదాత జగన్

రాజమహేంద్రవరం సిటీ: సంక్షేమ ప్రదాత సీఎం జగనన్న అని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని నాలుగు సచివాలయాల పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ అభివృద్ధి పథకాల ద్వారా రూ.35.51 కోట్ల లబ్ధి అందజేశారని, దాదాపు రూ.15 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమం నిర్వహించారు, ఈ ఐదు సచివాలయాల పరిధిలో రూ.35.51 కోట్లు సంక్షేమ పథకాలు అందాయన్నారు. విద్య, వైద్య రంగాలలో జగన్ విప్లవాత్మక మార్పులు చేపట్టి, మేలు చేశారన్నారు. వ్యవసాయాన్ని పండగలా మార్చి రైతును రాజుగా చేశారన్నారు. టీడీపీ హయాంలో వారి నాయకులకు, జన్మభూమి కమిటీలకు మాత్రమే సంక్షేమం దక్కేదన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు తమకి మళ్లీ సీఎంగా జగనన్నే కావాలని అంటున్నారన్నారు. 24వ డివిజన్ పరిధి జెండాపంజా రోడ్డులోని సచివాలయంలోనూ, 37, 38 డివిజన్ పరిధిలోని వీరభద్రపురం సచివాలయంలోనూ, స్థానిక 3,4 డివిజన్‌లని నెహ్రూ నగర్ సచివాలయంలోనూ ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ కార్పొరేటర్ బొంతా శ్రీహరి, మానే దొరబాబు, అర్జరపు వాసు, పెంకే సురేష్ పాల్గొన్నారు.



హుకుంపేటలో డిజిటల్ బోర్డు ఆవిష్కరణ

ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తి

కడియం: సంక్షేమ పథకాల అమలులో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తిగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. జేగురుపాడు సచివాలయం1 పరిధిలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి సంక్షేమ పథకం అర్హులకు అందుతోందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ లక్ష్మి, ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి శివాజీ, సచివాలయ కన్వీనర్లు పుట్టా బుజ్జి, వరసాల జగన్, పెనుమాక మాధురి, సాకా కిరణ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు. ముందుగా జెండాను ఆవిష్కరించారు. అలాగే గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు.

రూ.7.49 కోట్లతో అభివృద్ధి

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట సచివాలయం-4 పరిధిలో రూ.7.49 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఈవోపీఆర్అండ్ఆర్డీ, నోడల్ ఆఫీసర్ తాడి కృష్ణ, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. ఆ సచివాలయం పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తాడి కృష్ణ, తాటికొండ విష్ణుమూర్తి అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మానమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో చందన నాగేశ్వర్ నాయకత్వంలో రూ.6.76 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఎగురవేసి, పార్టీ నాయకులు గిరజాల శ్రీనివాసరావు నివాసంలో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకట్రావు, గ్రేడ్-5 సెక్రటరీ మణి దీపిక, సచివాలయ కన్వీనర్లు షేక్ మీరావలీ, వీర్ల నాగు, చిర్రా గణేష్, ముక్కపాటి రాంబాబు, కుప్పాల రాంబాబు పాల్గొన్నారు.

కార్తిక శుభారంభం.. ఆధ్యాత్మిక వైభవం



పుష్కరాలరేవులో భక్తుల పుణ్యస్నానాలు

- పుష్కరాల రేవుకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన శివాలయాలు

సీటీఆర్ఐ: శివకేశవులకు ప్రీతికరమైన కార్తికమాసం తొలిరోజు మంగళవారం తెల్లవారుజాము నుంచే అన్ని ప్రధాన గోదావరి స్నానఘట్టాలు భక్తులతో కిటకిటలాడాయి. పుష్కరాలరేవు వద్ద జనం తాకిడి అధికంగా కనబడింది. పుణ్యస్నానాలు చేసిన భక్తులు పుష్కలరావు మెట్లపై దీపాలు వెలిగించి గోదావరి జలాలలోకి వదిలారు. గోదావరి గట్టున ఉన్న ఉమామార్కండేయేశ్వర స్వామి ఆలయంలో జరిగిన అభిషేకాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక హారతలు, ధూప, ప్రాకారసేవలు, నందివాహన సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉమాకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు, భువనేశ్వరీదేవికి కుంకుమార్చనలు చేశారు. శృంగేరీ శారద శంకరమఠంలో చంద్రమౌళీశ్వరునికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. టి.నగర్‌లోని విశ్వేశ్వర స్వామి ఆలయం, జాంపేట ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన రుద్రాభిషేకాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఉమామార్కండేయేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

దేవుని పరిచర్య చేయడం అదృష్టం



బైబిల్ కాలేజ్ గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

సీటీఆర్ఐ: దేవుని పరిచర్య చేయడం అదృష్టమని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. రాజమండ్రి పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని చర్చ్ ఆఫ్ షాలోమ్ ఆఫ్ నెతన్యాలో మంగళవారం ఏపీ రాష్ట్ర థియలాజికల్ బెథైల్ కాలేజీ గ్రాడ్యుయేషన్‌డే ఘనంగా నిర్వహించారు. ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ ప్రతాప్ సిన్హా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ గుడూరి శ్రీనివాస్ హాజరయ్యారు. బెథైల్ కాలేజీలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 100 మందికి ప్రతాప్ సిన్హా కొమానపల్లి చేతుల మీదుగా పట్టాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆ ప్రభువు చూపిన శాంతి మార్గంలో ప్రజలందరూ పయనించేలా చేయాలని పిలుపునిచ్చారు. బిషప్ డాక్టర్ డానియేల్ రాజు వాక్య సందేశం ఇచ్చారు. పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ సుధీర్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కానుబోయిన సాగర్, దాసి వెంకటరావు, సంఘం జిల్లా ట్రెజరర్ పి.టాటా విక్టర్, జిల్లా సెక్రటరీ ఎం.విజయ సారథి పాల్గొన్నారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి



జగదీష్, ఎస్పీ

కంబాలచెరువు: కార్తిక మాసం సందర్భంగా గోదావరిలో పుణ్య స్నానాలు చేసే భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 11 వరకూ జరిగే కార్తిక మాసోత్సవాలు పురస్కరించుకుని భక్తులు తెల్లవారుజాము నుంచే గోదావరి ఘాట్లు, రేవులు, కాలువల్లో పుణ్య స్నానాలు ఆచరిస్తారన్నారు. పిల్లలు, వృద్ధులు, మహిళలను తీసుకుని వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నదిలో లోతు ప్రాంతాలకు వెళ్లకూడదని, దీపాలు వెలిగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముఖ్యమైన ఘాట్లు, నది పరివాహక ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

'పులివెందుల పులిబిడ్డ' సినిమా పోస్టర్ ఆవిష్కరణ



సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: సందేశాత్మక చిత్రాలు ప్రజాభిమానాన్ని ఎప్పుడూ చూరగొంటాయని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. కళావతి మూవీస్ బ్యానర్‌పై పెర్నపాటి విష్ణు దర్శకుడు, నిర్మాతగా వ్యవహరిస్తున్న పులివెందుల పులిబిడ్డ చిత్ర పోస్టర్‌ను మంగళవారం ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్ర కథను క్లుప్తంగా దర్శకుడు వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఫ్యాక్షనిజం నుంచి యువతను సక్రమ మార్గంలో పెట్టడానికి చేసే ప్రయత్నం, ప్రేమ తదితర అంశాలపై చిత్రం ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూడా ఈ సినిమాలో చూపించారన్నారు. దర్శకుడు, నిర్మాత పి.విష్ణు మాట్లాడుతూ ఈనెల 17న సినిమా విడుదల చేస్తున్నామన్నారు. చిత్రంలో హీరో, హీరోయిన్ల గా ప్రహ్లాద్, ఐశ్వర్య, ఇతర పాత్రలలో భానుచందర్, సత్యం, రాజేష్, సన, విజయరావు, భాస్కర్, భాగ్యమ్మ నటించారన్నారు.

షుగర్ బాధితులు జాగ్రత్తలు పాటించాలి

రాజమహేంద్రవరం రూరల్: షుగరు వ్యాధిగ్రస్తులు తగిన జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని వైఎస్సార్ సీపీ జిల్లా వైద్యవిభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత అన్నారు. రాజవోలు సచివాలయం-1 పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, మాజీ ఎంపీటీసీ నక్కా శ్యాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్ ప్రారంభించారు. శిబిరాన్ని మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి కేఎన్ జ్యోతి, డాక్టర్ అనసూరి పద్మలత సందర్శించారు. వరల్డ్ డయాబెటిక్ డే సందర్భంగా డాక్టర్ పద్మలత షుగర్ వ్యాధిగ్రస్తులకు పలు సూచనలు చేశారు. శిబిరంలో డాక్టర్లు పార్థసారథి, మౌనిక, మేరీలిడియా సుచిత్ర, జి.రోహిత, ఈ.నాగదేవి వైద్యసేవలు అందించారు. 545 మంది వైద్యసేవలు పొందగా, 10 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫరల్ చేశారు. పంచాయతీ కార్యదర్శి జి.కాశీవిశ్వనాథ్, సచివాలయ కన్వీనర్లు కాకరపర్తి కన్నబాబు, బోడదాసి కేతన, జిత్తుక వసంత్ కుమార్, సింహాద్రి రామలక్ష్మి, సంగిశెట్టి సత్యనారాయణ, బూసి కృష్ణ పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు (బాబు), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ వంశీ కిరణ్, భారత్ వికాస్ పరిషత్ మాజీ అధ్యక్షుడు పీవీఎస్ కృష్ణారావు తదితరులు సరస్వతీ విగ్రహాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. మాజీ ప్రధాని నెహ్రూ జయంతి సందర్భంగా ప్రముఖులతో ఆయన చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఫ్యూచర్ ఫోనిక్స్ ప్లే స్కూల్ విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ సెక్రటరీ మారిశెట్టి సత్యనారాయణ, డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ కామిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు దువ్వూరి స్మారక పురస్కారాల ప్రదానం

ప్రకాశం నగర్: స్వాతంత్ర్య సమరయోధురాలు దువ్వూరి సుబ్బమ్మ జయంతిని పురస్కరించుకుని పలువురు సాహిత్య, సామాజిక సేవాపరులకు దువ్వూరి సుబ్బమ్మ స్మారక సేవా అవార్డులు అందిస్తున్నట్లు సేవాసమితి అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. ప్రకాశం నగర్‌లోని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సుబ్బమ్మ జయంతిని ఈనెల బుధవారం స్థానిక సరస్వతీఘాట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.